www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 నవంబర్ 2024

5

పశ్చిమ గోదావరి

గల్ఫ్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి : ఎస్‌పి

భీమవరం టౌన్ : గల్ఫ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సూచించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖచే నిర్వహించబడుతున్న ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రేంట్స్ హైదరాబాద్, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సంయుక్త ఆధ్వర్యంలో గల్ఫ్ మోసాలపై భీమవరంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం జిల్లాలోని వివిధ వర్గాల ప్రజలు ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళ్లడం జరుగుతుందని, ప్రజల అవగాహన రాహిత్యం వల్ల మధ్యవర్తుల చేతుల్లో మోసపోవడం జరుగుతుందని తెలిపారు. నకిలీ ఏజెంట్లు, సంస్థల ప్రతినిధుల గురుంచి ఏదైనా సమాచారం వుంటే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం అందిస్తే, సదరు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులపై చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రేంట్స్ హైదరాబాద్ ప్రతినిధి ఎం.రవికుమార్, ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా.. ధాన్యం కొనుగోళ్లు..!

48 గంటల్లోపే ధాన్యం సొమ్ములు జమతో రైతులు హర్షం

ఏలూరు జిల్లాలో లక్షా 23 వేలు, 'పశ్చిమ'లో లక్షా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రెండు జిల్లాల్లో సరాసరి 40 శాతం వరకూ ఖరీఫ్ కోతలు పూర్తి

మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు చాలా వరకూ పూర్తయ్యే అవకాశం

సంచి బరువు 600 గ్రాములుగా తూకంపై ప్రత్యేకంగా అధికారుల దృష్టి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతోంది. గతకంటే సులువుగా ధాన్యం కొనుగోలు సాగుతుండడం, 48 గంటలు గడవకముందే ధాన్యం సొమ్ములు రైతుల ఖతాల్లో జమవుతుండడంతో రైతులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో లక్షా 92 వేల ఎకరాలు, పశ్చిమలో రెండు లక్షల ఐదు వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు సాగుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ దాదాపు 40 శాతం వరకూ వరి కోతలు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో 250, పశ్చిమలో 231 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో లక్షా 23 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.281 కోట్ల వరకూ ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఇప్పటివరకూ రూ.156 కోట్ల సొమ్ములు రైతుల ఖాతాల్లో జమకాగా, రూ.122 కోట్లకు సంబంధించి ప్రోసెసింగ్ ప్రక్రియలో ఉందని ఒకటి, రెండు రోజుల్లోనే జమకానున్నాయని అధికారులు తెలిపారు. 'పశ్చిమ'లో లక్షా పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.256 కోట్లు ధాన్యం కొనుగోలు జరిగింది, ఇప్పటి వరకూ రూ.250 కోట్ల వరకూ రైతుల ఖాతాల్లో జమైన పరిస్థితి నెలకొంది. ధాన్యం విక్రయించిన వెంటనే సొమ్ములు రైతుల ఖాతాల్లో జమవుతుండడం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ములు జమ చేస్తామని చెప్పినా రైతులు నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు కొనసాగాయి. ధాన్యం సొమ్ముల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసిన పరిస్థితి కొనసాగింది. అంతేకాకుండా తేమశాతం, వాహనాల కొరత, సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేస్తోంది. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే సొమ్ములు జమ చేస్తామని ప్రభుత్వం ముందుగానే చెప్పింది. ప్రభుత్వం చెప్పిన దానికంటే ముందుగానే సొమ్ములు జమవుతుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తేమ శాతంలో ఇబ్బందులు, సంచుల కొరత లేకపోవడంతో రైతులు ఉత్సహంగా ఖరీఫ్ మాసూలు సాగిస్తున్నారు. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన మిల్లులకు మాత్రమే ధాన్యం విక్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకపోవడం, రైతులు తమకు నచ్చిన మిల్లును ఎంచుకునే అవకాశం ఉండడంతో రైతులకు ధాన్యం అమ్ముకోవడంలో స్వేచ్ఛ లభించింది. సీజన్ పూర్తయ్యే వరకూ ఇదేవిధంగా ధాన్యం సొమ్ములు జమచేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. అలాకాకుండా ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రభుత్వం రైతుల విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది.

తూకంపై అధికారుల ప్రత్యేక దృష్టి

ధాన్యం కొనుగోలు వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు ధాన్యం కొనుగోలుపై అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగుతున్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉందని పత్రికల్లో వస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నారు. అంతేకాకుండా రైతులకు మేలు జరిగే విధంగా ధాన్యం తూకంపైనా అధికారులు దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షిస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో 40 కిలోలకు గాను సంచి బరువుతో కలిపి 41 కిలోలు తూకం తూసేవారు. సంచి బరువు 600 గ్రాములుగా మాత్రమే గుర్తించి తూకం 41 కిలోల 600 గ్రాములే ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. దీంతో క్షేత్రస్థాయిలో దీన్ని అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించిన పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులు రైతులకు దీనిపై అవగాహన కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇది రైతులకు ప్రయోజనం కలిగిస్తోంది. తూకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంపై రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. ముమ్మరంగా ఖరీఫ్ మాసూలు సాగుతుండడంతో మరో పది రోజుల్లో చాలా వరకూ ధాన్యం కొనుగోలు పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్



ఆక్వా రైతులు, హేచరీల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించడానికి త్వరలో స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. భీమవరంలో బుధవారం పర్యటించిన ఆయన ఆక్వా రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నాణ్యమైన విద్యుత్‌ను హేచరీలకు సరఫరా చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సబ్సిడీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, హేచరీల యాజమాన్యాలు కోరాయి. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా అవసరానికి తగినట్లు కొత్త సబ్ స్టేషన్లను గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హేచరీల యాజమాన్యాలతో అధికారులు సమావేశమై వారిపై ఆర్థిక భారం పడకుండా సమస్యపై నివేదిక అందించాలని ఆదేశించారు. ఆక్వా రైతుల సమస్యలపై ఇప్పటికే అసెంబ్లీలో చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే ఆక్వా రైతుల సమస్యలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆక్వా రైతులకు హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా ఆక్వారంగాన్ని వైసిపి ప్రభుత్వం కుదేలు చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముందు సాగుతోందని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, నేతలు, రైతులు పాల్గొన్నారు.

ముందుగా కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ రాజు (బిజెపి వర్మ)ను నరసయ్య అగ్రహారంలో ఇన్‌ఛార్జి మంత్రి ఆయన నివాసంలో పరామర్శించారు. అనంతరం వర్మ తండ్రి సూర్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

జిల్లాలో 64 ప్రభుత్వ హాస్పటల్లో ప్రత్యేకాధికారుల నియామకం

జిల్లా కలెక్టర్ నాగరాణి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో మధ్యాహ్నం నుంచి స్పెషలిస్టులు రావడం లేదని ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ ఫిర్యాదులకు స్వస్తి పలికేలా స్నేహపూరిత వైద్య సేవలందించాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్‌డిఒలు, ప్రభుత్వ హాస్పిటల్స్ సూపరింటెండెంట్లు, స్పెషలిస్టులు, వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 4 ఏరియా హాస్పిటళ్లు, 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక జిల్లా హాస్పటల్‌కు 64 మంది ప్రత్యేక అధికారులను ఆసుపత్రుల పర్యవేక్షణ నిమిత్తం నియమించినట్లు తెలిపారు. ప్రత్యేకాధికారులు ప్రతిరోజూ ఆయా హాస్పిటల్‌లో పనితీరు, డెలివరీలు, అవుట్, ఇన్ పేషంట్లకు అందుతున్న వైద్య సేవలు హాస్పిటల్స్ మంచి పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలను పూర్తిగా అధ్యయనం చేసి, సాయంత్రానికి జిల్లా కార్యాలయానికి పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. నిరుపేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ హాస్పిటల్స్‌ను వైద్య ఆలయాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ఆలోచన, ఆశయం అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ, అర్బన్ హెల్త్ సెంటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, జిల్లా హాస్పటల్, ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మూడు షిఫ్టుల ప్రకారం 24 గంటలు పని చేయాలని ఆదేశించారు. కిందస్థాయి ఉద్యోగి నుం,ఇ స్పెషలిస్టు డాక్టర్ వరకూ రోజుకు మూడు సార్లు యఫ్‌ఆర్‌యస్ అటెండెన్స్ తప్పక వేయాలని, మూడు పూటలా అటెండెన్స్‌ను జిల్లా కార్యాలయం నుంచి పరిశీలిస్తామని తెలిపారు. ఆచంట, పెనుగొండ మండలాల్లో లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నారని, కలిసికట్టుగా పనిచేసి మంచి పురోగతి సాధించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతా రాణి పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

దేశ సంపదను కొల్లగొట్టి ప్రజలపై భారాలు మోపి దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా దెబ్బతీసిన అదానీని తక్షణం అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, సిపిఎం పెంటపాడు మండల కన్వీనర్లు సిరపరపు రంగారావు, నాయకులు చిర్ల పుల్లారెడ్డి, బంకూర్ నాగేశ్వరరావు కోరారు. గురువారం పెంటపాడులోని సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల అమెరికాలోని న్యాయ సంస్థలు ప్రపంచంలో అవినీతి సామ్రాజ్యా న్ని నిర్మించిన అదానీపై అవినీతి ఆరోపణలు సాక్ష్యాధారాలతో నిరూపిస్తూ కేసు పెట్టిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసు ద్వారా రాష్ట్రంలో సోలార్ విద్యుత్తు వినియోగదారులపై భారాలు మోపేవిధంగా అదానితో గత వైసిపి ప్రభుత్వం, అధికారులు ప్రజాప్రతినిధులు రూ.1,750 కోట్ల లంచాలు తీసుకున్నట్టు సాక్షాలతో సహ సదరు న్యాయవ్యవస్థ తెలిపిందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదానీతో జరిగిన ఒప్పందాలన్నీ తక్షణం రద్దు చేయాలన్నారు. ప్రజలపై మోపిన భారాలు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో మోపిన విద్యుత్తు భారాలు రద్దు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. తక్షణం అదానీని, సంస్థ ప్రతినిధులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బర్ల బాలాజీ. దొర్ల సీతయ్య, బొట్ట నారాయణ, గంట నరసింహులు, కాసులు, గేదెల శివ, ధర్మరెడ్డి గణేష్, కటా రాము, కార్మికులు పాల్గొన్నారు.

కేశవరం బెయిలీ వంతెన నిర్మించాలి

సిపిఎం నేతల ఆందోళన

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - గణపవరం

ఉండి కాలువపై కేశవరం బెయిలీ వంతెన నిర్మించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన వంతెన వద్ద గురువారం నేతలు ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పి.నరశింమూర్తి మాట్లాడుతూ ఉండి కాలువపై ఉన్న కేశవరం వంతెన కూలిపోయి 20 ఏళ్లయినా ప్రభుత్వం పక్కా వంతెనన నిర్మాణం చేయకుండా బెయిలీ వంతెన ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందన్నారు. బెయిలీ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరి రేకులు ఊడిపోవడం వల్ల వాహనదారులు, బాటసారులు వంతెనకు పడిన రంధ్రాల్లో పడి గాయాలపాలవుతున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. వంతెన నుంచి ప్రతి రోజూ జల్లికాకినాడ, అప్పన్నపేట, మల్లపురాజు రాజు పేట, ఉండుర్రు, గ్రామాల నుంచి విద్యార్థులు, రైతులు, కేశవరం రాక పోకలు సాగిస్తారని అన్నారు. వంతెనకున్న రేకులు ఊడిపోవడంతో నడవడానికి ప్రజలు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బెయిలీ వంతెన నిర్మించాలని, అలాగే వంతెన పడిపోయిన చోట కొత్తగా పక్కా వంతెన నిర్మాణం చేయడానికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించాలని నరశింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కేతా శ్రీను, ఎస్.ఆశీర్వాదం, జోగి సత్యనారాయణ, పి.అంజిబాబు, పి.వీరన్న, సుబ్బరాజు పాల్గొన్నారు.

టోల్ గేట్ల నిర్ణయం విరమించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - యలమంచిలి

గ్రామీణ రహదారులపై టోల్ గేట్ల ఏర్పాటు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. గురువారం మండలంలోని చించినాడ శెట్టిబలిజపేట కమ్యూనిటీ హాలు వద్ద మాజీ ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్‌ఎస్) నగర్‌లో సిపిఎం మండల 8వ మహాసభ జిల్లెళ్ల ప్రశాంతి, చెల్లుబోయిన వడ్డీ కాసులు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు పరిశీలకులుగా బలరాంతో పాటు సిపిఎం జిల్లా నాయకులు కౌరు పెద్దిరాజు, కె.క్రాంతి బాబులు వ్యవహరించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నేత కేతా సూర్యారావు ఆవిష్కరించారు. అనంతరం గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకలాపాల రిపోర్టును మండల కార్యదర్శి బాలరాజు ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారులపై కూడా టోల్ ట్యాక్స్ చేయడం వల్ల సామాన్య కుటుంబాల వారికి పెనుభారంగా మారనుందని, ఇప్పటికే రోజు రోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర ధరలను అదుపు చేయలేని ఈ ప్రభుత్వం మద్యం ధరలు మాత్రం తగ్గించి, సామాన్య ప్రజల చేత ఎక్కువ మద్యం తాగించడానికి నూతన మద్యం పాలసీని అమలు చేసి పేద ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. ఇది చాలా అన్యాయమని గత వైసిపి పాలనకు ప్రస్తుత పాలనకు ఏ మాత్రం తేడాలేదని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ కూడా సక్రమంగా అమలు జరగకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణ దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, సిపిఎం జిల్లా నాయకుడు కె.క్రాంతి బాబు, కేత సూర్యారావులు మాట్లాడారు.

సిపిఎం మండల కార్యదర్శిగా బాలరాజు

సిపిఎం మండల కార్యదర్శిగా తిరిగి కానేటి బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండలంలోని చించినాడ గ్రామం శెట్టిబలిజ పేట కమ్యూనిటీ హాలు వద్ద ఆ పార్టీ మహాసభ అనంతరం జరిగిన నూతన మండల కమిటీ కార్యదర్శిగా తిరిగి బాలరాజును ఎన్నుకోగా, మండల కమిటీ సభ్యులుగా బాతిరెడ్డి జార్జి, ఎడ్ల మోహనరావు, గూడూరు ఆంజనేయులు, జిల్లెల్ల ప్రశాంతి, తెన్నేటి నాగరాజు, బాతిరెడ్డి సుగుణ, దిద్దే ఏసేపు, గూడూరు నాగేశ్వరరావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, చెల్లుబోయిన వడ్డీ కాసులు, అంబటి రంగనాయకులు, మల్లుల శ్రీరాములు సభ్యులుగా ఎన్నికయ్యారు.

9 మంది దొంగల ముఠా అరెస్టు

మరో ముగ్గురు కోసం గాలింపు : ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఒక్క దొంగతనంతోనే సెటిలైపోవాలి అనుకున్నాడు ఒక వ్యక్తి, అనుకున్నదే తడువుగా ఒకరు కాదు, ఇద్దరు కాదు, తనతో పాటు 11 మందిని జట్టుకుదుర్చుకున్నాడు. అనుకున్నట్టే భీమవరం ప్రాంతంలోని ఒక ఇంటిని ఎంచుకుని వారిని చంపైనా దోచుకోవాలనుకున్నారు. అలాంటి వారిని భీమవరం పోలీసులు ఆట కట్టించారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక జిల్లా ఎస్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం, రాజుపూడి గ్రామంకు చెందిన గంపల ఆనందబాబు తాను చేస్తున్న ఇంటర్నేషనల్ కార్పొరేషన్ నేచురల్ ప్రొడక్ట్ వ్యాపారంలో నష్టాలు రావడంతో, వ్యాపారం వల్ల లాభం లేదని, ఎక్కడైనా ధనవంతుల ఇళ్లను చూసి వాటిని దోచుకుని, విలాసవంతంగా బతకాలని ఉద్దేశించాడు. ఈమేరకు భీమవరం వంశీకృష్ణ నగర్ ఏరియాలో వున్న వేగేశ్న రంగరాజు ఇంటిని గంపల ఆనందబాబు ఎంచుకున్నాడు. అతని స్నేహితుడు బత్తిన రవీంద్ర కుమార్‌ను కలిసి ఒక పథకం ప్రకారం ఆ ఇంటిని దోచుకుని, అవసరమైతే ఆ ఇంటిలో ఉన్నవాళ్లను చంపైనా ఒక్కసారిగా ధనవంతులు కావాలని నిర్ణయించుకుని, దానికి బత్తిన రవీంద్రకుమార్ స్నేహితుడైన గోనిపాటి నానికి వారు దొంగతనం చేయాలనుకున్న ఇంటి గురించి చెప్పి, వారికి తోడుగా ఒక గ్యాంగ్‌ను తయారు చేయమని చెప్పారు. దానికి గోనిపాటి నాని కాకినాడ ఏరియాలో ఉండే తన స్నేహితులైన దార్తి దుర్గా నవీన్, గేదెల శ్యామ్ సత్య వరప్రసాద్, చింటూ అనువార్లను, గోనిపాటి నాని, అతని బంధువైన రాజమండ్రికి చెందిన దడాల శివశంకర్ అను అతని ద్వారా రాజమండ్రికి చెందిన గుంట రత్నకుమార్, దొంతుమల్ల శ్యామ్, ఉప్పుకుమార్ రాజు, ఘంటసాల భవాని శంకర్, నొక్కు నాని బాబును ఒక బ్యాచ్‌గా తయారుచేశారు. వారు 12 మంది కలిసి ఒక పథకం రచించుకుని వారు దోచుకోవాలనుకుంటున్న ఇంటిని ఈనెల 10వ తేదీన, 20వ తేదీన రెండుసార్లు రెక్కి నిర్వహించారు. రెండుసార్లు 23వ తేదీ రాత్రి రెండు కార్లలో బయలుదేరి మార్గమధ్యలో అవసరమైతే ఇంట్లో ఉన్నవారిని చంపైనా దొంగతనం చేయాలనే ఉద్దేశంతో పెద్ద సుత్తి, గుణపం, ఇనుప రాడ్డులు, పొడవాటి పదునైన కత్తులు, వాళ్లను గుర్తుపట్టకుండా ఉండడానికి ముఖానికి మంకీ క్యాపులు, చేతికి గ్లౌజులు, నల్లటి షర్ట్ తీసుకుని భీమవరం వచ్చి రాత్రి ఒంటి గంట సమయంలో సదరు ఇంటికి దొంగతనానికి వెళ్లగా ఆ ఇంటి వాచమెన్, ఇంటి ఓనర్ గట్టిగా కేకలు వేయడంతో పారిపోయారు. ఈ సంఘటనపై వేగేశ్న రంగరాజు భీమవరం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఆర్ నెం.291/2024, యుఎస్ 331(6), 310(4), 312 ఆర్‌డబ్ల్యూ 61(2), బిఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 27న అదే ఏరియాలో బాగా డబ్బున్న వారి ఇళ్లలో వారు మరలా దొంగతనం చేయడానికి 9 మంది రెండు కార్లు, రెండు మోటార్ సైకిల్ మీద భీమవరం వచ్చి భీమవరంలోని ఎస్ కన్వెన్షన్ పక్కన, ఎస్ కన్వెన్షన్ రోడ్, భీమవరం దగ్గర వెయిట్ చేస్తూ ఉండగా భీమవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కి వచ్చిన సమాచారంపై తన సిబ్బందితో ముద్దాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 9 మంది అరెస్టు కాగా ముగ్గురు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అనుమతుల్లేకుండా వైద్య సేవలందిస్తే చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రయివేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లు, డియాగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని అనుమతులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని వైద్య ఆరోగ్య అనుమతులు పొందాలన్నారు. రెన్యువల్ రిజిస్ట్రేషన్‌కు గడువులోగా నమోదు చేసుకోవాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత, రోగులకు, చికిత్సకు అవసరమైన సదుపాయాలు, తాగునీరు, ఆసుపత్రి రికార్డులు, రిజిస్టర్ నిర్వహణ వివిధ పరీక్షల ఫీజు ధరల పట్టికను అందరికీ కనబడేలా ప్రదర్శించాలన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, కుక్కకాటు, పాము కాటు, వివరాలు నిర్దేశించిన హెచ్ఐఎంఎస్ పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు, సలహాలు ఉండే పోస్టర్లను ఆసుపత్రుల్లో ప్రదర్శించాలన్నారు. పౌర రిజిస్ట్రేషన్ వ్యవస్థ సవరణ చట్టం ప్రకారం అన్నీ ప్రయివేటు ఆసుపత్రులు జననాలు, నిర్జీవ జననాలు, మరణాలను సకాలంలో నమోదు చేయాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పన ఉండాలి

భీమవరం : జిల్లాను ప్రత్యేక స్థానంలో నిలిపేలా విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పన ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పన, జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాల ప్రగతి, రాష్ట్రస్థాయిలో చర్చించాల్సిన, ప్లాన్ చేయాల్సిన అంశాలు, గత ఆగస్టు 5న అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా డాక్యుమెంట్‌కు ప్రత్యేక స్థానం ఉండేలా అన్ని అంశాలపై పకడ్బందీగా డాక్యుమెంట్‌ను రూపొందించాలన్నారు. ఇప్పటికే తయారుచేసిన డ్రాఫ్ట్ డాక్యుమెంట్లను సంబంధిత శాఖ అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి లోటుపాట్లను సరిచేయాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన రహదారుల గుంతలు పూడ్చివేత, పంచాయతీరాజ్ శాఖలో చేపట్టిన వివిధ భవన నిర్మాణ పనులు, పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఎస్‌టిపి ప్లాంట్‌లు, డంపింగ్ యార్డ్‌ల నిర్వహణ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం.మోహన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొల్లేరు పరిరక్షణకు సహకారం : జెసి

భీమవరం : కొల్లేరు సరస్సు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి కొల్లేరు బఫర్ జోన్ నిర్ధారణకు సంబంధించిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, దీనిని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. దీనికి గ్రామాల ప్రజల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. ఎన్‌జిటి నిబంధనలకు అనుగుణంగా కొల్లేరు ప్లస్-5 కాంటూరు నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఏకోసిస్టం బఫర్ జోన్ ఏర్పాటుకు సంబంధిత గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి, అభిప్రాయాలను సేకరించాలన్నారు. అనంతరం ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా డిఎఫ్ఒ ఆశా కిరణ్, ఏలూరు వైల్డ్ లైఫ్ డిఎఫ్ఒ బి.విజయ పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైద్య, ఆరోగ్య శాఖలో జరుగుతున్న సర్వేలు పూర్తిస్థాయిలో నిర్వహించి తాడేపల్లిగూడెం పట్టణాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టే విధంగా ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. పట్టణానికి చెందిన కడకట్ల, వీకర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లకు స్పెషల్ ఆఫీసర్‌గా తనను నియమించినట్లు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న కార్యక్రమాలకు సిబ్బంది అందరూ ఎప్పటికప్పుడు విధులకు హాజరు అయ్యేవిధంగా చూడవలసినదిగా వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ కోడవటి సురేష్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌డిపి పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం టౌన్ : వచ్చేనెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఎఫ్‌డిపి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కన్వీనర్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ బి.హెచ్.వివిఎస్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఎఐసిటిఇ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్(ఎటిఎఎల్) అకాడమీ ప్రాయోజితం చేస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్‌లో 'ఎంపవరింగ్ ఎడ్యుకేటర్స్ : ఫర్ ప్రాక్టికల్ ఎక్సలెన్స్' పేరిట ఆరు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా ఈ ఆన్‌లైన్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని నూతన సాంకేతికతను అధ్యయనం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా డాక్టర్ ఎస్.కె.కామేశ్వరరావు, డాక్టర్ శివశంకర్ రెడ్డి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కువైట్‌లో పెనుగొండ వాసి మృతి

దేవ గ్రామంలో విషాదచాయలు

పెనుగొండ : కుటుంబ పోషణ ఆర్థిక భారంగా మారడంతో ఉపాధి నిమిత్తం కువైట్ దేశం వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని దేవ గ్రామానికి చెందిన గూనపాటి చినబాబు(40) గత ఆరు సంవత్సరాలుగా కువైట్ దేశంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ తరహాలో చినబాబు ఇటీవల మూడు నెలల క్రితం తన సొంత గ్రామమైన దేవ గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యుల్ని చూసుకుని, తిరిగి కువైట్ కంపెనీకి వెళ్లారు. ఈనెల 27వ తేదీ బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు గుండె నొప్పితో మృతి చెందినట్లు మృతుడు బంధువులు భార్యకు సమాచారం అందజేశారు. చిన బాబు ఆకస్మికంగా మృతి చెందడంతో దేవ గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు కలరు. మృతదేహం కువైట్ నుంచి రావలసి ఉందని బంధువులు తెలిపారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

మొగల్తూరు : మండలంలోని శేరేపాలెం ఎస్‌సి పేట నుంచి కొత్తపాలెం గరువు పేట వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు గుంతలమయం అయింది, దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఒడుగు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శేరేపాలెం గ్రామంలో సిపిఎం మండల నాయకులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఒడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. శేరేపాలెం ఎస్‌సి పేట నుంచి మొగల్తూరు కోట మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యడ్ల చిట్టిబాబు, వీరా పాండురంగారావు ఉన్నారు.

నేడు అఖండ అన్న సమారాధన

కాళ్ల : కాళ్ల గ్రామంలో కార్తీకమాస సందర్భంగా ఈనెల 29న అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. గ్రామంలో ఉన్న గంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మండలపరిధి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారాలతో స్వామివారి కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఆకివీడు : స్థానిక గంగానమ్మ కోడు పూర్తిస్థాయిలో విస్తరించే క్రమంలో భాగంగా మార్కెట్ రోడ్‌లో కోడుగట్టుపై ఉన్న వాణిజ్య వర్తక దుకాణాలు తీసివేయవలసిందిగా అధికారులు గురువారం వారికి నోటీసులు ఇచ్చారు. ఆమేరకు వారు స్వయంగా తీసివేయడం మొదలుపెట్టారు. కాగా అదే ప్రాంతంలో ఉన్న ముస్లిం కాంప్లెక్స్ షాపులు గుమ్మం వద్ద ఉన్న డ్రైనేజీ ఆక్రమణలను, వాటిపై ఉన్న కాంక్రీట్ నిర్మాణాలను నగర పంచాయతీ అధికారులు తొలగించారు. వీరికి గతంలోనే నోటీసులు ఇచ్చినట్లుగా తెలిపారు. తొలగింపబోతుండటంతో గురువారం ఈ చర్య చేపట్టారు. మిగిలిన ప్రాంతంలో నివాస ప్రాంతాలు పెద్దగా లేకపోయినా ఎక్కువ శాతం వాణిజ్య వర్తక దుకాణాలు ఉండడం గమనార్హం.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం : 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ హౌసింగ్ బోర్డు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపి ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి అన్నారు. నిట్ ఫీడర్, రైల్వే ఫీడర్, రిలయన్స్ ఫీడర్, సత్యవతినగర్ ఫీడర్లకు సంబంధించిన నిట్ కాలేజీ, బిఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, కోతి బొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్, భూపాల్ నగర్ గవర్నమెంట్ హాస్పిటల్, మామిడి తోట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ హౌసింగ్ బోర్డ్, శశి కాలేజ్, గణేష్ నగర్, మిలటరీ కాలనీ, గాంధీబొమ్మ సెంటర్, సత్యవతి నగర్, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, బాపూజీ పుంత రోడ్ ఏరియాల్లో లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని గురువారం ప్రకటన విడుదల చేశారు. కావున పట్టణ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

వార్డు సచివాలయాల్లో తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణ పరిధిలోని వార్డు సచివాలయాలను గురువారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. వీవర్స్ కాలనీ, కన్నుల పేట వద్ద సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్, ఎన్‌పిసిఐ, ఇతర సర్వేలు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వర్లు ఉదయం నుంచే బాగా పని చేస్తాయన్నారు. కాబట్టి సచివాలయ ఉద్యోగులు సిబ్బంది ఉదయం విధుల నిర్వహణ బాగుండునని సూచించారు. అనంతరం వారి హాజరు పట్టీ, వారి జాబ్ చార్టులను, డైరీని, ప్రజలు పెట్టుకున్న అర్జీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఏరియా ఆసుపత్రిని గురువారం నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించారు. బాలింతలు పొందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయి? భోజనం బాగుంటుందా? సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలపాలని ఆయన ఫిర్యాదుల పెట్టెను సూచించారు.

రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రైతులు కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఒబ్బిడి చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎడిఎ డాక్టర్ అనిల్ కుమారి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. అనంతరం పంట కోసే రైతుల వద్దకు వెళ్లి ప్రస్తుతం తుపాన్ హెచ్చరిక ఉన్నందున రైతులెవరూ వరి కోతలు కోయరాదన్నారు. ఒకవేళ కోస్తే భద్రపరచుకోవాలన్నారు. వర్షపు నీరు బయటకు పోయే విధంగా రైతులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆమె వెంట జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తుపాను ముప్పు ఉన్న నేపథ్యంలో రైతులు ధాన్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. గురువారం ఆయన దువ్వలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. కల్లాల్లో ఉన్న ధాన్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఎం.వి.రమేష్, తహశీల్దార్ డివిఎస్ అశోక్ వర్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బడుగు, బలహీన తరగతుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి - గణపవరం

పూలే అంటరానితనం, కులవివక్ష నిర్మూలనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని సర్పంచి చుక్కా చినరంగారావు, సిపిఎం నాయకులు పివిఆర్.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని జల్లికాకినాడలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచి చుక్కా చిన రంగారావు, సిపిఎం నాయకులు పివిఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు. పూలే విగ్రహానికి శెట్టి సంక్షేమ సంఘ అధ్యక్షులు పంపన శ్రీనివాస్‌రావు, బిజెపి నాయకులు ఇందుకూరి ఆశోక చక్రవర్తి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంపన మాణిక్యాలరావు, కవురు రవి, స్థానికులు పాల్గొన్నారు.


గణపవరం : పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకొల్లు : పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలోని గాంధీ భవనంలో పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ, కొలుకులూరి అర్జున్‌రావు, మడగల గోపాల్‌రావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజంలోని అంటరానితనాన్ని నిర్మూలించుటకు చేసిన పోరాటం అభినందనీయం అన్నారు. పూలే పోరాట స్ఫూర్తిని, తన ఆలోచనా విధానాన్ని అందరం ఆచరించి, ముందు తరాల వారికి తెలియజేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోనం వెంకట్రావు, కె.ప్రభుదాస్, షేక్ మహబూబా జానీ, వై.నామగిరి, వర్ధనపు కాసు, రొక్కాల బెన్నీపాల్, యలమర్తి మోహనరావు, రూంకానీ శ్రీనివాసరావు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తదనంతరం నిడదవోలు, నరసాపురం రోడ్డులోవున్న జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఉన్న జ్యోతిరావు పూలే నిలువెత్తు విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పెనుమంట్ర : బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన మహా విద్యాదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పాలా ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని మార్టేరు గ్రామంలో వెస్ట్ గోదావరి సెంటర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పలువురు స్థానిక బిసి నాయకులు పూలమాలలు వేసి నివాళి తెలిపారు. అప్పటి దయనీయమైన సామాజిక పరిస్థితిలో విద్య అనే దీపం ద్వారా బడుగులకు దారి దీపం దొరుకుతుందని చెప్పిన నేత జ్యోతిరావు పూలే అని మండల మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ వనకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ బిసి జాయింట్ యాక్షన్ కన్వీనర్ కడలి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఒఎన్‌జిసి ఉద్యోగి కడలి వెంకటేశ్వరరావు, నరసాపురం డివిజన్ దేవాంగ చేనేత అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఆర్.భాస్కర్, కడలి లక్ష్మీనారాయణ, సురేష్, విద్యార్థులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలోని ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపల్లి అనిల్, పెద్దపాటి వర్మా, దగ్గుమిల్లు సాయి, నిమ్మకాయల దుర్గారావు ఉన్నారు.

ఆచంట : బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పాటుపడిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారని పలువురు కొనియాడారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా ఆచంటలో పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు, బీరా నరసింహమూర్తి, కేత మురళీ, కొండేటి వీరస్వామి, బాలం వెంకటరమణ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకు : కుల, వర్ణ, వివక్షతకు పోరాడినటువంటి మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని టిడిపి నాయకురాలు వావిలాల సరళాదేవి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా స్థానిక పెద్ద వంతెన వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు జ్యోతిరావుపూలే అన్నారు. గుబ్బల శ్రీనివాస్, కడియాల సూర్యనారాయణ, గుమ్మళ్ల హనుమంతు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వర్మకు పరామర్శ

భీమవరం టౌన్ : కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. కేంద్ర మంత్రి తండ్రి సూర్యనారాయణ రాజు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. సూర్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ధాన్యం కాటాలను పరిశీలిస్తున్న తూనికలు కొలతల అధికారి

ధాన్యం కాటాల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

వీరవాసరం : ఈనెల 28న 'తూకంలో మోసం అరికట్టేదెవరు!' అనే శీర్షికతో ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనానికి భీమవరం తూనికలు, కొలతల శాఖ, వీరవాసరం వ్యవసాయ శాఖాధికారులు స్పందించారు. గురువారం వీరవాసరం, బాలేపల్లి పరిసరాలలో రైతుల సమక్షంలో ధాన్యం పట్టుబడి సమయంలో రైతుల సమక్షంలో పరిశీలించారు. తూనికల, కొలతల అధికారి వి.వి.నాగరాజారావు మాట్లాడుతూ ధాన్యం తూకానికి వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటా తూకంలో ఎటువంటి పొరపాటులు లేవన్నారు. తూకం సమయంలో కాటాలు సక్రమంగా ఉన్నట్టు పరిశీలనలో తేలిందన్నారు. ఇదేవిధంగా మెంటే శంకరావు రైస్ మిల్లు వద్ద లారీ తూకాన్ని కూడా పరిశీలించగా అదికూడా సక్రమంగా ఉన్నట్టు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని తూకం వేసేడప్పుడు ఎటువంటి అనుమానం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈయన వెంట మండల వ్యవసాయాధికారి బిన్నిబాబు ఉన్నారు.

సిపిఎం ఏరియా కమిటీ కార్యదర్శిగా తవిటినాయుడు

ఆకివీడు : సిపిఎం ఆకివీడు ఏరియా కమిటీ కార్యదర్శిగా కె.తవిటినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక నేరెళ్ల ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిపిఎం 9వ పట్టణ మహాసభల ముగింపు సందర్భంగా ప్రతినిధులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా కె.తవిటినాయుడు, సభ్యులుగా పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, బివి.వర్మ, డి.రవితేజ, బి.రాంబాబు, ఎస్.ఉదయకుమారి, కె.పార్వతి, సాకా కిసింజర్, బి.కళ్యాణి, జి.ధనుష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహాసభలో మండలంలో ఉన్న పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేశారు. పట్టణం చుట్టు పక్కల గ్రామాల్లో ఇల్లు లేని వారికి తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించాలని అన్నారు. అపరిష్కృతంగా ఉన్న డంపింగ్ యార్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఆకివీడు పరిధిలో రైల్వే గేట్లు వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తాళ్లకోడు ఇళ్ల స్థలాల కాలనీలో మౌలిక సదుపాయాలైన మంచినీరు, డ్రెయినేజీ, రోడ్లు ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించిందని ఆయన తెలిపారు. తాళ్లకోడు కాలనీని ఆకివీడు నగర పంచాయతీలో అనుసంధానం చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని మహాసభలో తీర్మానాలు ఆమోదించినట్లు ఆయన చెప్పారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల జాబితా ఆమోదం

మొగల్తూరు : పట్టభద్రుల ఎంఎల్‌ఎసి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల మొదటి జాబితాను అధికారులు ఆమోదించడం జరిగిందని తహశీల్దార్ కె.రాజకిశోర్ గురువారం తెలిపారు. మండలంలోని 17 పంచాయతీలకు సంబంధించి 1,696 దరఖాస్తులు రాగా మొదటి జాబితాలో 1416 మంది ఓటర్ల పేర్లు జాబితాలో చోటుచేసుకున్నాయన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, దరఖాస్తులు ఇచ్చిన పత్రాలు సరిగ్గా ఉంటే ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని, ఏమైనా తేడాలు ఉంటే సంబంధిత దరఖాస్తుదారునికి సమాచారమందించి, దరఖాస్తులను సరిచేయడం జరుగుతుందన్నారు. కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కెవి.సత్యనారాయణ ఆధ్వర్యంలో విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, విఆర్‌ఎలు పరిశీలిస్తారని తెలిపారు.

సిపిఎం సానుభూతిపరుడు నరసింహస్వామి మృతి

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు నరసింహ స్వామి మృతి బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన నరసింహ స్వామి మృతదేహాన్ని గురువారం సిపిఎం శ్రేణులతో కలిసి బలరాం సందర్శించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పూర్వం నుంచి సిపిఎంకు అండగా నిలుస్తున్న కుటుంబానికి చెందిన నర్సింహాస్వామి పిన్నవయసులోనే మృతిచెందడం ఆ కుటుంబానికి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులు ఈశ్వరుడు, ఆంజనేయులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు కౌరు పెద్దిరాజు, కె.క్రాంతి బాబు, కేతా సూర్యారావు, కె.బాలరాజు, బి.జార్జి, డి.సుధాకర్, జె.ప్రశాంతి, బి.సుగుణ, వడ్డి కాసులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన చిన్నా

నరసాపురం: పౌర సరఫరాల శాఖ మంత్రి , జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ని జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం తెనాలిలో మంత్రి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం శివాలయం వద్ద సుబ్రహ్మణ్య స్వామి వారి షష్ఠి సందర్భంగా డిసెంబర్ 7వ తేదీన నిర్వహించే అఖండ అన్నసమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని మంత్రిని చిన్నా ఆహ్వానించారు. అనంతరం ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

మానవత మండల కార్యదర్శి రంగరాజు

ఉండి : సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. గురువారం ఉండిలో మానవత సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎంపికైన గోడి నిస్సి ఫ్లోరాను సత్కరించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన ఫ్లోరా అభినందనీయులు అన్నారు. మానవత మండల ఛైర్మెన్ కొమ్మన నాగబాబు, కో కన్వీనర్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఫ్లోరా ఈ స్థాయికి ఎదగడానికి తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు ఏసురత్నం, తల్లి వర్జినియా హెడ్ నర్సుగా పనిచేస్తూ తమ కుమార్తె చదువు విషయంలో వారు అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు. ఈ సందర్భంగా ఫ్లోరా కుటుంబీకులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఫ్లోరా మెరిట్ స్టూడెంట్‌గా రాణించిందన్నారు. గోల్డ్ మెడల్, డాక్టరేట్ సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు పెన్మెత్స రంగప్రసాద్ రాజు, గోడి ఏసు రత్నం పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత

నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద

ఆచంట : శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద అన్నారు. ఆచంట పోలీస్ స్టేషన్‌ను గురువారం నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో పాటు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మహిళలు, ఆడపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానంటూ మోసం చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి విషయాలలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. గంజాయి నియంత్రణకు కఠినచర్యలు చేపడతామని, మాదకద్రవ్యాల నియంత్రణకు సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలలు సందర్శించి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చేసేందుకు ముమ్మరంగా దాడులు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎస్ఐ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో ఖాళీ పోస్టు భర్తీ చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా, వినతి

పెనుగొండ : పెనుగొండలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎండి(డాక్టర్ ఆఫ్ మెడిసిన్) పోస్ట్ ఖాళీను భర్తీ చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం సిహెచ్‌సి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సిహెచ్‌సి సూపరింటెండెంట్ జి.చంద్ర సావేరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎండి(వైద్య నిపుణుడు) లేకపోవడంతో చాలా కేసులు తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించడం వల్ల రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆసుపత్రిలో గాయాలకు కట్లు కట్టేవారు లేని దుస్థితి నెలకొందన్నారు. పెనుగొండ గ్రామ శాఖా కార్యదర్శి ఎన్.గంగారావు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో తక్షణం ఒక ఎండి, కట్లు కట్టే పనివారు 4 ఖాళీలు భర్తీ చేయాలని, ఫిజియోథెరపీ పరికరాలు ఉన్నా ఇప్పటివరకు డాక్టర్‌ను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రయివేటు వారిని ఆశ్రయించవలసి వస్తుందని తెలిపారు. మండల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. 30 పడకల ఆసుపత్రిని 50 పడకలుగా ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరపు వెంకటేష్, శీలం ఏసు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పాత్రికేయ వృత్తి ఎంతో పవిత్రమైంది : ఎంఎల్ఎ

నరసాపురం: సమాజంలో పాత్రికేయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, జర్నలిస్టులు వారి బాధ్యతను గుర్తించుకుని నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం నరసాపురం అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్(ఎపిజెయు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ నాయకర్, ప్రభుత్వ సలహాదారులు ఎం.ఎ.షరీఫ్, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు, కొప్పర్రు గ్రామ అభివృద్ధి ప్రదాత పోలిశెట్టి శ్రీనివాస్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ పాత్రికేయులు వృత్తిపరంగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కుంటున్నారని అన్నారు. ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలువబడుతున్న పత్రికా వ్యవస్థ ఎంతో గొప్పదన్నారు. పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతోమంది జర్నలిస్టులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ కూడా వృత్తి మీదే సమయం కేటాయించి పదునైన వార్తలు రాస్తూ, గ్రామీణ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతి జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతి సంక్షేమ పథకం అందాలన్నారు. జర్నలిస్టులు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులను గజమాలతో ఘనంగా సన్మానించారు. పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. నాయకులు సంకు భాస్కరనాయుడు,కోటిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలిశెట్టి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకర్, షరీఫ్

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయడానికి విరాళాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, కమిటీ సభ్యులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించే సిపిఎం జిల్లా 28వ మహాసభలు డిసెంబరు 20, 21, 22 తేదీలలో భీమవరంలో జరగనున్నాయని ఆయన అన్నారు. మహాసభల నిర్వహణ, ఉద్యమ సహాయనిధికి విరాళాలు అందించవలసిందిగా స్థానిక పట్టణ ప్రజలను ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే భారాలపై పోరాటాలు, ఉద్యమాలను సిపిఎం సాగిస్తోందని తెలిపారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, చేతి వృత్తిదారులు, చిన్న వ్యాపారులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత కార్మికులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం కృషిచేస్తుందని ఆయన తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికై సిపిఎం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, దత్తు రాము, మాదాసు రాజు, శిద్దిరెడ్డి శేషుబాబు, దేవల శివ గణేష్, పోతు శ్రీను, నాగిరెడ్డి సాయి, మిద్దె జాను, అన్నం చిన్నారావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **GUNDUGOLLU CHANDRA SEKHAR** S/o. GUNDUGOLLU MAHANKALI R/o.D.No. 15-9, Pedapeta, Near Church, Undi Village, Undi Mandal, West Godavari District (A.P) - 534199. I have changed my name from GUNDUGOLUNU SEKHAR (Old Name) to **GUNDUGOLLU CHANDRA SEKHAR** (New Name) S/o GUNDUGOLLU MAHANKALI.

పత్రికా ప్రకటన

నా క్లయింటు లోయ రంగారావు అను వారు ది.18.09.2020వ తేదీన ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, పడమరవీధి, చ.గ.130.0.0లు స్థలమును గుర్రం శివకుమార్ గారి నుండి క్రయం పొంది ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం.6396/2020రుగా సంక్రమించిన ఆస్తికి సంబంధించి లింకు దస్తావేజు యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం.2360/2018 ఇల్లు మారుతున్న సమయంలో పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ నా క్లయింటుకు గాని అప్పగించగలరు.

కె.వి.పి.మాధవరావు, అడ్వకేట్ & నోటరీ
సెల్: 9440111033

బహిరంగ ప్రకటన

ప.గో.జిల్లా, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు బ్రాడీపేటకు చెందిన గుబ్బల పార్థసారథి S/o.సత్యనారాయణ గారు మాకు యిచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. మా క్లయింటు పెనుమదం గ్రామం నుండి పాలకొల్లు వస్తుండగా తన మోటార్‌సైకిల్‌లో పెట్టుకున్న కాగితములు ఉన్న కవరు పడిపోయినది. కవరులో ఉన్న కాగితాలు వివరములు :
1.0012209550 నెంబరు గల 100/- ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
2.0012209551 నెంబరు గల 100/- ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
3.8282 నెంబరు గల 22/5/2024 తేది 10/- ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
4.8283 నెంబరు గల 22/5/2024 తేది 10/- ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
5.781431 నెంబరు గల SBI, Palakol బ్యాంకు ఖాళీ చెక్కు సంతకం చేసి ఉన్నది.
6.781465 నెంబరు గల SBI, Palakol బ్యాంకు ఖాళీ చెక్కు సంతకం చేసి ఉన్నది.
7.రెండు ఖాళీ ప్రాంశరీనోట్లు - సంతకం చేసి ఉన్నవి.
పై కాగితములు గల కవరు మా క్లయింటు తన స్నేహితుని వద్ద బాకి తీర్చివేసి తెచ్చుకొనుచుండగా కవరుతో సహా మోటార్‌సైకిల్ వేగంలో పడిపోయినవి. దొరికిన వారు మా క్లయింటు ఫోన్ నెంబరు 9441429824 గాని, ఈ క్రింది న్యాయవాది నెంబరుకు గాని తెలుపగలరు. అందజేసిన వార్కి మంచి బహుమతి ఇవ్వబడుతుంది. మా క్లయింటు పోగొట్టుకున్న కాగితములు ఎవరైన Miss use చేసిన యెడల మా క్లయింటుతీసుకునే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.
పాలకొల్లు — **అప్పారి హరిబాబు**
ది.28-11-2024 — న్యాయవాది, రాజోలు.

In the Court of the III Addl. District Judge : Nellore
O.S.No. 49 / 2023
1. M/s. DR Hotels & Resorts, Nellore, Rep.by its Managing Partner **K.Dhanunjaya Reddy**
2. M/s. DR Hotels & Resorts, Nellore, Rep.by its Managing Partner **K.Deepakram Reddy** - Plaintiffs
Vs
1. Ruddaraju Jithendra Srinivasa Varma & 11 Others - Defendants
Notice
To,
D7. Penumathsa Venkata Krishnam Raju, S/o **Rama Chandra Raju,** resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
D8. Penumathsa Hema Venkata Naga Swapna, W/o **Venkata Krishnam Raju,** resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
పై నెంబరున వాదులు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే10-12-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఆర్.ఎన్.సునీత
వాదుల తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the III Addl. District Judge : Nellore
I.A.No. 510 / 2023
O.S.No. 49 / 2023
1. M/s. DR Hotels & Resorts, Nellore, Rep.by its Managing Partner **K.Dhanunjaya Reddy**
2. M/s. DR Hotels & Resorts, Nellore, Rep. by its Managing Partner **K.Deepakram Reddy** -Petitioners/ Plaintiffs
Vs
1. Ruddaraju Jithendra Srinivasa Varma & 11 Others - Respondents / Defendants
Notice
To,
R7. Penumathsa Venkata Krishnam Raju, S/o **Rama Chandra Raju,** resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
R8. Penumathsa Hema Venkata Naga Swapna, W/o **Venkata Krishnam Raju,** resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
పై నెంబరున పిటిషనర్లు / వాదులు తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో మీకు నోటీసు నిమిత్తం **తే10-12-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఆర్.ఎన్.సునీత
పిటిషనర్లు / వాదుల తరపు అడ్వకేట్, నెల్లూరు.